నాగార్జునసాగర్‌లో 74.50 శాతం పోలింగ్

హాలియా, మే 14 : ఈ నెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 74.50 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,36,484 మంది ఓటర్లు ఉండగా 1,76,190 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. మాడ్గులపల్లి మండలంలో అత్యధికంగా 86.39 శాతం పోలింగ్ నమోదు కాగా పెద్దవూర మండలంలో అత్యల్పంగా 67.80 శాతం నమోదైంది. మిగిలిన అన్ని మండలాల్లో 72 శాతానికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యధిక ఓటర్లు పెద్దవూర మండలంలో 47,283 మంది ఉండగా అత్యల్పంగా మాడ్గులపల్లి మండలంలో 7,710 మంది ఉన్నారు.

నిడమనూరులో 77.83 శాతం

నిడమనూరు, మే 14 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండలంలో సోమవారం జరిగిన పోలింగ్ 77.83 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మండలంలో మొత్తం 35,820 మంది ఓటర్లకు గానూ 27,879 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 13,873 మంది పురుషులు, 14,006 మంది మహిళలు ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గతంలో కంటే ఈ సారి ఓటింగ్ శాతం పెరిగినట్లు అధికారులు తెలిపారు.

తిరుమలగిరి(సాగర్)లో 75.52 శాతం

తిరుమలగిరి(సాగర్) : పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలో 75.52శాతంగా పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. మొత్తం 34,910 మంది ఓటర్లు ఉండగా 25,310 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు.

హాలియాలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

మండలం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	ఇతరులు	పురుషులు	మహిళలు	శాతం
అనుముల	36,245	27,198	3	13,481	13,714	75.04
గుర్రంపోడు	38,255	29,456	2	14,936	14,518	77.00
మాడ్గులపల్లి	7,710	6,661	0	3,339	3,322	86.39
నిడమనూర్	35,820	27,879	0	13,873	14,006	77.83
పెద్దవూర	47,283	32,060	2	15,949	16,109	67.80
టి.సాగర్	34,910	25,315	1	12,646	12,668	72.52
త్రిపురారం	36,261	27,621	2	13,725	13,894	76.17
మొత్తం	2,36,484	1,76,190	10	87,949	88,231	74.50

కట్టంగూర్‌లో తగ్గిన పోలింగ్

కట్టంగూర్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

కట్టంగూర్ : సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలో 78.17 శాతం పోలింగ్ నమోదైయింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 88.52 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ సారి 10.35 పోలింగ్ శాతం తగ్గింది. మొత్తం 37,207 ఓటర్లు ఉండగా 29,086 మంది తమ ఓటు హక్కును వినియో గించుకున్నారు. పురుషులు 14,874మంది, మహిళలు 14, 212 మంది ఉన్నారు. మండలంలో అత్యధికంగా పిట్టంపల్లిలో 89.53 శాతం, అత్యల్పంగా దుగినవెల్లిలో 65.28 శాతం నమోదైంది.

ఉపాధ్యాయుల మీద లాఠీ చార్జ్ చేయించిన ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలి : టీఎస్ యూటీఎఫ్

రామగిరి, మే 14: ఎన్నికల విధుల్లో హాజరై నిబంధనల ప్రకారం రెమ్యునరేషన్ చెల్లించాలని అడిగిన ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీ చార్జ్ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సైదులు, వెంకటేశం మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యునరేషన్ ఇవ్వాలని పీఓ, ఏపీఓలకు రోజుకు రూ. 600, ఓపీఓలకు రూ. 400 ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 61ని ఈనెల 11న విడుదల చేసిందని పేర్కొన్నారు. దీని ప్రకారం మెదక్ పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ నియోజవర్గాల్లో పీఓ, ఏపీఓలకు రూ.3,150 చెల్లించగా నారాయణఖేడ్‌లో మాత్రం రూ. 2,400 మాత్రమే ఇచ్చారని వివరించారు. రెమ్యునరేషన్ చెల్లింపులో తేడా ఎందుకనే ప్రశ్నించిన సంఘం రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులపై ఆర్డీఓ ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణ రహితంగా లాఠీచార్జ్ చేసి ఉపాధ్యాయులను గాయపరిచారని వివరించారు.

అక్రమంగా మట్టి తరలింపు

దండంపల్లి వద్ద బ్రాహ్మణ వెల్లెంల కాల్వ వెంట ఉన్న మట్టిని ఎత్తుకెళ్లడానికి వచ్చిన జేసీబీ, టిప్పర్

నల్లగొండరూరల్, మే 14: నల్లగొండ మండలంలోని దండంపల్లి గ్రామ సమీపంలో ఉన్న బ్రాహ్మణ వెల్లెంల కాల్వ వెంట ఉన్న మట్టిని కొంత మంది తరలించుకు పోతున్నారు. అనుమతులు లేకుండా జేసీబీ ద్వారా తవ్వి టిప్పర్లలో నింపి మరీ తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. ఇప్పటికే వేల టిప్పర్ల మట్టిని తరలించిన అమ్ముకున్నారు. ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికలు కావడం, జిల్లా యంత్రాంగం అంతా ఎన్నికల హడావుడిలో ఉండడంతో ఇదే అదనుగా భావించిన కొందరు వ్యాపారులు సోమవారం, మంగళవారాల్లో సుమారుగా 10 టిప్పర్ల ద్వారా మట్టిని తరలించి నల్లగొండలోని రియల్ ఎస్టేట్ వారికి విక్రయించారు. అధికారులు స్పందించి మట్టిని తరలించకుండా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
మరిన్ని వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | తొలుపులే : 9182777638

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- వేములపల్లి మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధుల అండతో కొనసాగుతున్న దందా
- వాల్టా చట్టానికి యథేచ్ఛగా తూట్లు
- ప్రధాన రహదారుల గుండానే తరలింపు
- మామూళ్ల మత్తులో పోలీసు అధికారులు

సల్కునూరు వాగులో ఇసుకను నింపడానికి సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

వేములపల్లి, మే 14 : మండలంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా సాగుతున్నది. ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతి లేకపోయినా వాగులు, వంకలు కొల్లగొడుతూ లక్షల్లో ఆర్జిస్తున్నారు. దాంతో దళారులు, పోలీసు అధికారులకు నిత్యం కాసుల వర్షం కురుస్తున్నది. ఇసుక రవాణా చేసే వారు వాల్టా చట్టానికి తూట్లు పెడుతున్నా వారిచ్చే మామూళ్ల మత్తులో అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేములపల్లి మండలం రావులపెంట, సల్కునూ రు, పాలేరు మూసీ వాగు నుంచి ప్రతి రో జు 30 నుంచి 40 ట్రాక్టర్లు భీమారం–సూ ర్యాపేట రహదారి మీదుగా మిర్యాలగూడకు ఇసుక అక్రమంగా రవాణా కొనసాగుతున్నది.

పర్యవేక్షణ కరువు..

ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నా మిర్యాలగూడ రూరల్, వేములపల్లి పోలీసులు,అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకులు ఇసుక ట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూలు చేసి పోలీసు అధికారులకు నెలనెలా రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు అందజేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కాగా వేములపల్లి పోలీస్ స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్ నాలుగేండ్లుగా తిష్ట వేసి ఇసుక ట్రాక్టర్ల యజమానులతో పరిచయాలు పెంచుకొని ట్రాక్టర్‌కు రూ.200 నుంచి రూ.300 వరకు కమీషన్ తీసుకొని వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

మూసీవాగు నుంచి మంగళవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

మైనింగ్ అనుమతి ఉన్నవారు మాత్రమే ఇసుకను తరలించాలి. అక్రమంగా ఎవరైనా ఇసుకను తరలిస్తే వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేస్తాం. రూరల్ పరిధిలోని ఎస్ఐలకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నాము. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకొంటాం.

-వీరబాబు, సీఐ, మిర్యాలగూడ రూరల్

ముమ్మరంగా ఉపాధి పనులు

మాటూరు గ్రామంలో పంట కాల్వ పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

త్రిపురారం, మే 14: మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఏపీఓ వరలక్ష్మి తెలిపారు. పంట కాల్వ, పొలాలకు వెళ్లే రోడ్లు బాగు చేసే పనులు, గట్ల పైన కందకాలు తవ్వే పనులు చేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం మండల వ్యాప్తంగా 4,650 మంది కూలీలు పనులకు హాజరైనట్లు చెప్పారు. పనులు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణానికి హాజరైన భక్తులు

హాలియా, మే 14 : అనుముల మండలం కొత్తపల్లి గ్రామంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వార్షిక కల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. ఆలయ అర్చకుడు గొట్టి ముక్కుల నర్సింహాచార్యులు చిట్టిపోలు వెంకన్న, అలుగుల బ్రహ్మానందరెడ్డి, పంగ వెంకటేశ్వర్లు, పాతనబోయిన సురేశ్, పిల్లి శ్రీను, కృష్ణమాచారి, మేకల పరమేశ్, లింగయ్య, పంగ శ్రీను పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

శాలిగౌరారం, మే 14 : తండ్రిని కోల్పోయిన స్నేహితుడికి తోటి స్నేహితులు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. శాలిగౌరారం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002–03 సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు అదే గ్రామానికి చెందిన గుండ్ల పెల్లి ఉపేందర్ తండ్రి వెంకన్న ఇటీవల వడదెబ్బతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు రూ.15 వేలు పోగు చేసి ఉపేందర్‌కు అందజేశారు.

ఎక్సైజ్ సీఐ మల్లయ్యకు మాజీ ఎమ్మెల్యే భగత్ పరామర్శ

హాలియా, మే 14 : హజారిగూడెం గ్రామానికి చెందిన ఎక్సైజ్ సీఐ శీలం మల్లయ్య మేనత్త సైదమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది.మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ హజారిగూడెం గ్రామానికి వెళ్లి సైదమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కురాకుల వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంటిగోర్ల పాపయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు వహాబ్, నాయకులు కేశబోయిన శంకర్, మన్యం కృష్ణమూర్తి, నడ్డి రవి, ఎర్రబోయిన వెంకటేశ్వర్లు, కుంటిగోర్ల మల్లయ్య ఉన్నారు.

పేకాడుతున్న 9 మందిపై కేసు

నిడమనూరు, మే 14 : మండలంలోని గుంటుకగూడెంలో పేకాడుతున్న 9 మందిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామ శివారులో కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేసి 9మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.23 వేల నగదు, 8 సెల్ ఫోన్లు, బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.

పదో తరగతి ఫలితాల్లో నల్లగొండ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

శ్లోక, విశ్వేశ్వర్‌కుమార్

రామగిరి, మే 14: సీబీఎస్ఈ మంగళవారం విడుదల చేసిన పదోతరగతి ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ చాటారు. 2023–24 విద్యా సంవత్సరంలో పరీక్ష ఫలితాల్లో ఎ.శ్లోక, ఆర్.విశ్వేశ్వర్‌కుమార్ (489/500) సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పార్థసారథి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితం, ఐటీలో 100 మంది విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠశాల చైర్మన్ జగిని భీమయ్య, కార్యదర్శి డి.అమరేందర్‌రావు, కోశాధికారి పి.వెంకటనారాయణ అభినందనలు తెలిపారు.

నిరుపయోగంగా పీఏసీఎస్ భవనాలు

త్రిపురారం : మండల కేంద్రంలో రూ.65లక్షలతో నిర్మించిన ప్రాథమిక సహకార సంఘ భవనం

రాగడప గ్రామంలో రూ.8లక్షలతో మరమ్మతులు చేసి నిరుపయోగంలో ఉంచిన ప్రాథమిక సహకార సంఘం

త్రిపురారం, మే 14 : మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. ఒకప్పుడు మండలంలో రాగడప, బెజ్జికల్, త్రిపురారం పీఏసీఎస్‌లు వేర్వేరుగా ఉండేవి. ఆ తర్వాత రాగడప, బెజ్జికల్ సొసైటీలను త్రిపురారంలో విలీనం చేశారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రూ.65 లక్షలతో వ్యాపార సముదాయాన్ని నిర్మించారు. వీటిని నిర్మించి సంవత్సరం అయినప్పటికీ వాటిని కిరాయికి ఇవ్వక పోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. మండలంలోని బెజ్జికల్ గ్రామంలో మూతపడి ఉన్న సొసైటీ భవనానికి రూ.13లక్షలు ఖర్చు చేసి రిపేరు చేయించారు. దానిని కూడా ప్రస్తుతం నిరుపయోగంగా వదిలేశారు. అయితే కేవలం 3,4 లక్షల పనిచేసి రూ.13 లక్షలు డ్రా చేసినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇంత ఖర్చు పెట్టి బాగు చేసిన భవనాన్ని నిరుపయోగంగా వదిలేయడంతో పెంట దిబ్బగా మారింది. దాంతో పాటు రాగడప గ్రామంలో సొసైటీ వవనానికి రూ.8 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించి నిరుపయోగంగా వదిలేశారు. ఇందులో కూడా నిధులు స్వాహా అయ్యాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయమై ప్రస్తుత సీఈఓ కొరివి నర్సయ్యను వివరణ కోరగా గతంలో జరిగిన తప్పులను పునరావృతం కాకుండా చూస్తామని పేర్కొన్నారు. సొసైటీ నిధులతో నిర్మించిన భవనాలను కిరాయికి ఇస్తున్నామని, బెజ్జికల్, రాగడపలో ఉన్న సొసైటీ భవనాల్లో వచ్చే సీజన్ నుంచి వ్యాపార లావాదేవీలు జరుపుతామని తెలిపారు.

నిర్ణయించిన ధరలకే సామగ్రి విక్రయించాలి

- దేవాదాయ, ధర్మాదాయ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి

నకిరేకల్ : నెల్లిబండలో వేలం నిర్వహిస్తున్న దేవాదాయ, ధర్మాదాయ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, మేనేజర్ వెంకటేశం

నకిరేకల్, మే 14 : జాతరలో సామగ్రిని దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిర్ణయించిన రేట్ల ప్రకారమే విక్రయించాలని ఆ శాఖ ఇన్స్పెక్టర్ ఎం. వెంకటలక్ష్మి సూచించారు. నకిరేకల్ మండలంలోని నెల్లిబండ గ్రామపంచాయతీ ఆవరణలో లింగమంతుల స్వామి జాతరను పురస్కరించుకొని పలు రకాల సామగ్రి విక్రయ హక్కుకు కోసం మంగళవారం వేలం నిర్వహించారు. ఈ వేలంలో కొబ్బరికాయ విక్రయ హక్కుకు రూ.50 వేలు, లడ్డూ మిఠాయి విక్రయ హక్కుకు రూ.9వేలు, తైబజారు హక్కుకు రూ. 10 వేలకు వేలం పాడారు. కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, మేనేజర్ వెంకటేశం ఆలయ కమిటీ చైర్మన్ యానాల యాదగిరిరెడ్డి, డైరెక్టర్ బాతుక లింగస్వామి, ఆడెపు సతీశ్, బోయిళ్ల అశ్విని, గుడుగుంట్ల శివశంకర్, వీరబోయిన అబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి స్వాతి పాల్గొన్నారు.

నెల్లిబండ జాతరకు ఏర్పాట్లు చేయండి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నెల్లిబండ లింగమంతుల స్వామి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించే ఏర్పాట్లు చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. ఈ నెల 19, 20,21 తేదీల్లో నెల్లిబండ గుట్టపై నిర్వహించనున్న జాతరకు ఆలయ కమిటీ చైర్మన్ యానాల యాదగిరిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. అంతకుముందు ఎమ్మెల్యేను దేవస్థాన కమిటీ శాలువాతో సన్మానించారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు బాతుక లింగస్వామి, ఆడెపు సతీశ్, బోయిళ్ల అశ్విని, గుడుగుంట్ల శివశంకర్, వీరబోయిన అబ్బయ్య, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, నాయకులు యానాల శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ అమరుడికి గుర్తింపేదీ..?

- నిడమనూరులో రోడ్డు వెడల్పులో తొలగించిన హైవే అధికారులు
- దీనావస్థలో ఉన్నం చెన్నకేశవులు విగ్రహం

నిడమనూరు గ్రంథాలయం ప్రహరీ వెంట పడి ఉన్న పోలీస్ అమరుడు ఉన్నం చెన్నకేశవులు విగ్రహం

నిడమనూరు, మే 14 : పోలీసు అమరుడు, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఉన్నం చెన్నకేశవులు విగ్రహం మూడేండ్లుగా మండల కేంద్రంలో రోడ్డు పక్కనే పడి ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మేళ్లచెర్వు మండలం నెమలిపురి వద్ద 2003, జూన్ 16న కూబింగ్ విధుల్లో ఉన్న చెన్నకేశవులు మావోయిస్టులు పేల్చిన మందు పాతరకు బలయ్యాడు. ఆయన తల్లిదండ్రులు తమ కుమారుడి విగ్రహాన్ని అప్పట్లోనే ఏర్పాటు చేయించారు. రోడ్డు వెంట ఉన్న ఉన్నం చెన్నకేశవులు విగ్రహాన్ని జాతీయ రహదారి 167 నిర్మాణంలో భాగంగా హైవే అధికారులు తొలగించారు. రోడ్డు నిర్మాణం అనంతరం పునరుద్ధరిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. రోడ్డు పనులు పూర్తయి మూడేండ్లు గడిచినా విగ్రహాన్ని మాత్రం పునరుద్ధరించలేదు. పోలీస్ స్టేషన్ ప్రహరీని ఆనుకొని ఉన్న పోలీసు అమరవీరుడి విగ్రహం దీన స్థితిని చూసి దారిన పోయే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని చెన్నకేశవులు విగ్రహ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన ట్రావెల్స్ బస్సు..డ్రైవర్ మృతి



నల్లగొండ శివారులో ప్రమాదంలో రెండు ముక్కలైన ట్రాక్టర్

నీలగిరి, మే 14 : ట్రావెల్స్ బస్సు ట్రాక్టర్‌ను ఢీ కొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటననల్లగొండ పట్టణ శివారులోని అద్దంకి– నార్కట్‌పల్లి జాతీయ రహదారి అర్జాలబావి వద్ద మంగళవారం జరిగింది. నల్లగొండ రూరల్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పెద్దవూర మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన పరంగి మహేశ్(24) నల్లగొండలోని హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం మట్టి లోడుతో నల్లగొండ వైపు వస్తుండగా హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు అతివేగంగా నడుపుతూ ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మహేశ్ గాయాలు కావడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందారు. మృతుడి భార్య వర్ష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మరో ప్రమాదంలో..

మాడ్గులపల్లి : మండలంలోని కుక్కడం గ్రామ శివారులో అద్దంకి– నార్కట్‌పల్లి రహదారిపై మంగళవారం బస్సు ఢీకొని లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఎస్ఐ శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన నయీమ్ రెహమాన్(33) మధ్యప్రదేశ్‌లోని రాత్లం నుంచి చెన్నైకు మెంతుల లోడ్‌తో వెళ్తున్నాడు. కుక్కడం గ్రామ శివారులోకి రాగానే రెహమాన్ లారీని ఆపి రోడ్డు దాటుతుండగా అదే సమయంలో నల్లగొండ నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న చిలుకలూరిపేట డిపోకు చెందిన బస్సు రెహమాన్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మిర్యాలగూడలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుడు రెహ్మాన్ బామ్మర్ది సమీర్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.